సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

Download Sandesham Times
Short News App!
Speed in News.. Truth in Analysis!
Scan to Download
Download
Download Now
Get it on on Google Play

మంగళవారం 07 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 309 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## ఆదిలాబాద్‌లో భారీ అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు

సందేశం టైమ్స్, ఆదిలాబాద్, ఏప్రిల్ 7, ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ,రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ లో పిప్రి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి జిల్లాలో అభివృద్ధికి కొత్త ఊపునిచ్చారు. బోథ్ నియోజకవర్గంలోని అడేగామా గ్రామంలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి, పొచ్చెర గ్రామంలో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌కు, శ్రీ నాగోబా దేవస్థానం అభివృద్ధి, సుందరీకరణకు రూ.20.10 కోట్లతో శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల భవనాన్ని రూ.20 కోట్లతో ప్రారంభించి, సిరికొండ మండలం కొండాపూర్‌లో రూ.13.46 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్‌లో ఐటీడీఏ నూతన భవనానికి రూ.15 కోట్లతో శంకుస్థాపన చేయగా, ఇచ్చోడ–డెడ్రా రహదారి నిర్మాణానికి రూ.30 కోట్లతో పనులు ప్రారంభించారు. జైనథ్‌లో మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గురుకుల పాఠశాల భవనాన్ని రూ.20 కోట్లతో ప్రారంభించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో రూ.30 కోట్లతో 38 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ధన్నూర్, కుప్టి, కుచ్లాపూర్ ప్రాంతాల్లో మూడు 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి రూ.8.99 కోట్లతో శంకుస్థాపనలు చేసి, పిప్రి మరియు తేజాపూర్ ఎత్తిపోతల పథకాలకు వరుసగా రూ.50.70 కోట్లు, రూ.44.64 కోట్లతో పనులు ప్రారంభించారు. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్‌లో త్రివేణి సంగం చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రూ.65.85 కోట్లతో, లాండసాంగి వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి రూ.6.435 కోట్లతో, సిరికొండలో చిక్‌మన్ వాగు ప్రాజెక్ట్‌కు రూ.31.52 కోట్లతో, అలాగే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం అమ్మనమడుగు వాగు ప్రాజెక్ట్ మరమ్మతులకు రూ.11.76 కోట్లతో శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాలతో జిల్లాలో విద్య, సాగు నీరు, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం అవుతుందని అధికారులు తెలిపారు.



## ఆరోగ్యశాఖలో 692 వైద్యుల ఎంపిక పూర్తి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రతినిధి: డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (నిపుణులు) పదవుల భర్తీ ప్రక్రియ పూర్తయిందని వైద్య ఆరోగ్య సేవల నియామక మండలి ప్రకటించింది. ఎంపికైన వైద్యుల జాబితాను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఇందులో మత్తు వైద్యం విభాగంలో 226, ప్రసూతి-స్త్రీరోగ విభాగంలో 247, శిశురోగ విభాగంలో 219 మంది ఎంపికయ్యారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న ఎంపికైన 692 మంది వైద్యులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేయనున్నారు. మొత్తం 1616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (నిపుణులు), 607 సహాయ ప్రొఫెసర్ పదవుల భర్తీకి గత ఏడాది నోటిఫికేషన్ విడుదల కాగా, అందులో భాగంగా గైనకాలజీ, అనస్తేషియా, పీడియాట్రిక్స్ విభాగాలకు సంబంధించిన 692 పదవుల భర్తీ పూర్తయింది. మిగిలిన 924 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (నిపుణులు) పదవుల భర్తీ ప్రక్రియ మే నెలలో పూర్తికానుంది. అదేవిధంగా 607 సహాయ ప్రొఫెసర్ పదవుల్లో భాగంగా 174 పదవుల భర్తీ ఇప్పటికే పూర్తి చేసి ఫలితాలు ప్రకటించారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి కూడా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నియామక పత్రాలు అందించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సింగ్ అధికారులు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు తదితర అన్ని రకాల పదవుల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయబడింది. గడిచిన రెండున్నర సంవత్సరాల్లో 9,572 పదవులను భర్తీ చేయగా, మరో 7,562 పదవుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగా 866 పదవుల భర్తీ కూడా నేటితో పూర్తయింది. మరో 2,312 నర్సింగ్ అధికారుల ఫలితాలు త్వరలో విడుదల కానున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో మొత్తం భర్తీ చేసిన పదవుల సంఖ్య 12,750కు చేరనుంది.

## అర్హులైన పాత్రికేయులకు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగింపు




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రతినిధి: సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి.హెచ్. ప్రియాంక పాత్రికేయుల గుర్తింపు కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై ఇటీవల కొన్ని మాధ్యమాలలో ప్రచారంలో ఉన్న వార్తల నేపథ్యంలో పాత్రికేయులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటివరకు అందిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి గుర్తింపు కమిటీ సమావేశంలో సమగ్రంగా పరిశీలించి అర్హత కలిగిన పాత్రికేయులకు కొత్త గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు అంతర్జాల విధానంలో తమ దరఖాస్తులను సమర్పించాలని, ఏప్రిల్ నెలలోనే గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఇదే విధంగా జిల్లా స్థాయిలో కూడా కమిటీ సమావేశాలు నిర్వహించి అర్హులైన పాత్రికేయులకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కావున జిల్లా స్థాయిలో అర్హత కలిగిన పాత్రికేయులు ఆలస్యం చేయకుండా వెంటనే అంతర్జాలం ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని ప్రత్యేక కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



## ఎండాకాల తాగునీటి అవసరాలపై సమగ్ర సమీక్షలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రతినిధి: నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సరఫరా, రబీ పంటల చివరి దశ నీటిపారుదల, రాష్ట్రంలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, అలాగే కాళేశ్వరం లిఫ్ట్ నీటిపారుదల పథకానికి సంబంధించిన కేంద్ర జలవనరుల పరిశోధనా సంస్థ అధ్యయనాల ప్రగతిపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమీక్షల్లో అధికారులు సమర్పించిన నివేదికలను పరిశీలించిన మంత్రి, ఎండాకాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో నిరంతర నీటి సరఫరా కొనసాగించేలా ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రబీ పంటల చివరి నీటిపారుదల కీలక దశలో ఉన్నందున రైతులకు ఇబ్బందులు కలగకుండా సాగునీటి విడుదలను సమయానికి నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి, నిర్ణయించిన గడువుల్లో పూర్తి చేయాలని, అలాగే నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. కాళేశ్వరం పథకంపై జరుగుతున్న శాస్త్రీయ అధ్యయనాల నివేదికలను ఆధారంగా తీసుకుని భవిష్యత్తు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలు, వ్యవసాయ అవసరాలు రెండింటినీ సమన్వయం చేస్తూ నీటి నిర్వహణలో సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పిఠాపురం రైల్వే స్టేషన్‌కు అమృత్ భారత్ పథకం కింద రూ.37.25 కోట్ల అభివృద్ధి



సందేశం టైమ్స్, పిఠాపురం, ఏప్రిల్ 7, ప్రతినిధి: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషితో పిఠాపురం రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకం పరిధిలోకి చేరి సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఆయన చేసిన ప్రతిపాదనలకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలపడంతో రూ.37.25 కోట్ల వ్యయంతో స్టేషన్‌లో మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టనున్నారు. గతంలో పిఠాపురం పర్యటన సందర్భంగా స్టేషన్ పరిసరాల్లో ఉన్న అస్వచ్ఛతను గుర్తించిన ఉపముఖ్యమంత్రి వెంటనే శుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఢిల్లీ పర్యటనలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమై పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంతానికి దేశవ్యాప్తంగా యాత్రికులు వస్తున్న నేపథ్యంలో, వారి సౌకర్యార్థం ఆధునిక సదుపాయాలతో స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకం కింద పిఠాపురం స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా స్టేషన్ భవనం, ముఖద్వారం, దివ్యాంగులకు అనుకూలమైన విశ్రాంతి గదులు, ఆధునిక మరుగుదొడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ కేబులింగ్, ప్లాట్‌ఫారం అభివృద్ధి, షెల్టర్లు వంటి పలు పనులు చేపట్టనున్నారు. పిఠాపురం అభివృద్ధికి సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్ పనులకు ఈ నెల 28న శ్రీకారం




సందేశం టైమ్స్, విశాఖపట్నం, ఏప్రిల్ 7, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద సాంకేతిక పెట్టుబడిగా భావిస్తున్న గూగుల్ డేటా సెంటర్ నిర్మాణ పనులు ఈ నెల 28న అధికారికంగా ప్రారంభం కానున్నాయి. సుమారు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు విశాఖపట్నంలో ఏర్పాటు కానుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, గూగుల్ క్లౌడ్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి థామస్ కురియన్ తదితరులు హాజరుకానున్నారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీ మౌలిక వసతుల సంస్థల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు అమలు చేయనున్నారు. ఆధునిక సాంకేతిక సదుపాయాలతో రూపొందనున్న ఈ డేటా సెంటర్ ద్వారా ఐటీ రంగానికి భారీ ప్రోత్సాహం లభించడంతో పాటు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. 2028 జూలై నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రాన్ని డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు.

# ఆహార భద్రతపై రాజీ లేదు – కల్తీదారులపై కఠిన చర్యలు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రతినిధి: ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించే విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, కల్తీ ఆహార పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. నగరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభించి మాట్లాడిన ఆయన, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షకు పైగా ఆహార వ్యాపార సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వాటిలో ఎక్కువ భాగం పట్టణ ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న అవసరాలను కొంతమంది దుర్వినియోగం చేస్తూ ఆహార పదార్థాల్లో కల్తీకి పాల్పడుతున్నారని, నాసిరకం పదార్థాలతో తయారైన ఆహారం ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదంగా మారుతోందని అన్నారు. కల్తీ ఆహారం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు, గుండె మరియు మూత్రపిండ వ్యాధులు పెరుగుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రత అమలులో మరింత కఠిన చర్యలు తీసుకుంటున్నామని, గత రెండేళ్లలో వేలాది తనిఖీలు నిర్వహించి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదనంగా పరిశీలనా సిబ్బంది నియామకం, సంచార పరీక్ష వాహనాల వినియోగం, కొత్త పరీక్ష ప్రయోగశాలల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి పౌరుడికి పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, అదే సమయంలో ఆహార ఉత్పత్తిదారులు, వ్యాపారులు, వినియోగదారులందరూ తమ బాధ్యతను గుర్తించి కలిసి పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.



# కోహెడ పండ్ల మార్కెట్‌పై దుష్ప్రచారం – మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖండన

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రతినిధి: కోహెడ పండ్ల మార్కెట్ భూముల అంశంపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మాజీ మంత్రి టి. హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ స్వార్థంతో రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం కోహెడలో ప్రతిపాదిత పండ్ల మార్కెట్ భూములను అమ్మే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని సౌకర్యాలతో మార్కెట్ నిర్మాణానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు వేల కోట్ల వ్యయంతో సమగ్ర నివేదిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో అభివృద్ధి జరగలేదని విమర్శిస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెట్ అభివృద్ధికి చర్యలు ప్రారంభించిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించేందుకు అదనపు భూములను కేటాయిస్తూ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. పండ్ల ఎగుమతులు, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు ద్వారా రైతులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, దుష్ప్రచారాలను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న నిమ్మ రమేష్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 7, ప్రతినిధి: టేక్మాల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించగా, మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను సమానంగా ఆదుకునేది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమని తెలిపారు. ఇల్లు లేని పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా లబ్ధిదారులను గుర్తించడంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ షేక్ మజహార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి అషిలీ విద్యాసాగర్, టౌన్ అధ్యక్షుడు కిషోర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలమని ధనుంజయ, శ్రావణి శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అమీన్పూర్‌లో సీసీ, బీటీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

సందేశం టైమ్స్, పటాన్‌చెరు, ఏప్రిల్ 7, ప్రతినిధి: అమీన్పూర్ డివిజన్‌లో సుమారు రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో సీసీ, బీటీ రహదారుల నిర్మాణ పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. సాయి అంబికా కాలనీ నుండి ఐలాపూర్ తాండా వరకు, లాలాబాయి కాలనీ నుండి బొల్లారం పరిశ్రమల ప్రాంతం వరకు ఈ రహదారి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నూతన రహదారుల నిర్మాణంతో కాలనీ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించబడుతుందని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల నాగేశ్వర్ రెడ్డి, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు దేవానందం, మాజీ జిల్లా పరిషత్ సభ్యుడు సుధాకర్ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారి సురేష్ తదితర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకర జీవనానికి ‘ఈట్ రైట్ వాక్’ నిర్వహణ

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 7, ప్రతినిధి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆధ్వర్యంలో ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు సోమవారం ‘ఈట్ రైట్ వాక్’ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత ప్రత్యేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ సర్కిల్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు ఈ వాక్ కొనసాగింది. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా, పలు శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ప్రతిమా సింగ్ సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం ఆరోగ్యకర జీవితానికి మౌలిక అవసరాలని తెలిపారు. ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండి పండ్లు, కూరగాయలు, ధాన్యాలు వంటి సహజ ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రోటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి శక్తి లభిస్తుందని, కార్బోహైడ్రేట్ల వినియోగాన్ని పరిమితం చేయాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులపాటు ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 8న రక్షిత మాతృత్వం, 9న వ్యాధి నియంత్రణ అవగాహన ర్యాలీలు, 10న ఆయుష్ దినోత్సవం, 11న మత్తు పదార్థాల నివారణపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిన్నారం మున్సిపల్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, ఏప్రిల్ 7, ప్రతినిధి: జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఊట్ల గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బత్తుల మహేష్, బ్యాగరి వెంకటేష్, మాజీ సర్పంచ్ గోవిందు రాజు, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మహేష్ ముదిరాజ్, పూజారి కృష్ణ, నడిమింటి యాదగిరి, నడిమింటి నాగరాజ్, నడిమింటి నాగేష్, మీసాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బత్తుల మహేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5న నిర్వహించే బాబు జగ్జీవన్ రామ్ జయంతిని సమతా దివస్‌గా జరుపుకుంటామని తెలిపారు. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామంలో జన్మించిన ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడిగా, దళితుల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. భారతదేశపు తొలి కార్మిక మంత్రిగా, రక్షణ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించిన ఆయన 1946 నుండి మూడున్నర దశాబ్దాలపాటు కేంద్ర మంత్రిగా సేవలందించినట్లు వివరించారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు.



# ప్రజావాణి విజ్ఞప్తులకు తక్షణ పరిష్కారం చూపాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 7, ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను సత్వరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి ఎల్లయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు దూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ప్రజల విజ్ఞప్తులను ఆలస్యం చేయకుండా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఫిర్యాదులను శాఖల వారీగా నమోదు చేసి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తిరస్కరించాల్సిన పరిస్థితి వస్తే దానికి సంబంధించిన కారణాలను అర్జీదారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 98 దరఖాస్తులు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ స్థాపన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ



సందేశం టైమ్స్, జోగిపేట, ఏప్రిల్ 7, ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని జోగిపేటలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయం సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పార్టీ చరిత్ర, అభివృద్ధి, భవిష్యత్ లక్ష్యాలపై ప్రసంగించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 7, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఆందోల్–జోగిపేట మున్సిపల్ పరిధిలోని 13వ వార్డుకు చెందిన బండిమీది వెంకటేశం అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి తెలంగాణ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ఉపశమన నిధి చెక్కును మంజూరు చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రంగ సురేష్ గుప్తా, జోగిపేట ఆత్మ కమిటీ డైరెక్టర్ చిట్యాల మధు కలిసి బాధితుడికి చెక్కును అందజేసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# పేదలకు నాణ్యమైన రేషన్ బియ్యం సకాలంలో అందాలి: మెదక్ ఆర్టీవో రమాదేవి



సందేశం టైమ్స్, ఏప్రిల్ 07, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: మెదక్ జిల్లా కేంద్రంలోని మెదక్ టౌన్‌లోని FPShop No. 1784003 ను సంబంధిత తాసిల్దార్ తో కలిసి పరిశీలించిన మెదక్ ఆర్డీవో రమాదేవి, కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం సకాలంలో, నిర్ణీత పరిమాణంలో పంపిణీ చేయాలని సూచించారు.ఆర్డీవో పోస్ (ePoS) యంత్రాల పనితీరును, రేషన్ షాపుల్లో సరుకుల నిల్వలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పెద్ద గోపులారం గ్రామంలో మహిళలకు కుట్టు శిక్షణ – యంత్రాల పంపిణీ

సందేశం టైమ్స్, మునిపల్లి మండల్, ఏప్రిల్ 07, అందోల్ నియోజకవర్గం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పెద్ద గోపులారం గ్రామంలో గ్రామ స్వరాజ్య సమస్త కుట్టు శిక్షణ కేంద్రంను ప్రారంభించి 26 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందించారు. ఈ అవకాశంలో ప్రతిభావంతులైన మహిళలకు 26 కుట్టు యంత్రాలను కూడా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ పాండు, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, ఉప సర్పంచ్, సీనియర్ నాయకుడు రసూల్ పటేల్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.కేంద్ర శిక్షణ మరియు యంత్రాల పంపిణీ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక స్వరాజ్య సాధనలో భాగం కావాలని ప్రత్యేకంగా భావించారు.




# వడదెబ్బ నివారణకు ముందస్తు చర్యలు తప్పనిసరి – కలెక్టర్ ప్రావీణ్య


సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా లో వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హీట్ వేవ్ నివేదికలను ప్రతిరోజూ పంచుకోవాలని సీపీఓకు ఆదేశిస్తూ, కార్మికులు, ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా నిల్వ ఉంచాలని సూచించారు. అంగన్వాడీలు, గురుకులాలు, వసతి గృహాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కూడా ఓఆర్ఎస్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ముఖ్యంగా కూలీలు, పరిశ్రమలు, భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. బస్టాండ్లు, పని ప్రదేశాలు, పరిశ్రమల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు సూచించారు. జిల్లాలో ఎక్కడా వడదెబ్బ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.




# ఏప్రిల్ 10 నుంచి 518 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం: మెదక్ జిల్లా అదనపు కలెక్టర్

సందేశం టైమ్స్, ఏప్రిల్ 07, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు, ఏప్రిల్ 10 నుంచి జిల్లా వ్యాప్తంగా 518 ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్ద ఎత్తున ప్రారంభించనున్నారు.సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో సివిల్ సప్లై అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల యాజమాన్యులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ నాగేష్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తగిన సామగ్రి—గన్నీ బ్యాగులు, తూకం కొలతల ఫార్మ్‌లు, తార్పాలిన్ కవర్లు—అందుబాటులో ఉండాలని, రైస్ మిల్లర్ యాజమానులు హమాలీ రవాణా వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని చూసుకోవాలని ఆదేశించారు.తద్వారా యాసంగి సీజన్ CMR త్వరగా పూర్తి కావాలని, ధాన్యం తూకం కొలతలను నియమాలు ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరియు రైస్ మిల్లులలో తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ఫీల్డ్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా కోపరేటివ్ అధికారి కరుణాకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, రైస్ మిల్లర్ యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి జాతర మహోత్సవాలకు ఆహ్వానం



సందేశం టైమ్స్, రాయికోడ్, ఏప్రిల్ 07, అందోల్ నియోజకవర్గం ప్రతినిధి: రాయికోడ్ మండల్, సంగారెడ్డి జిల్లా లో భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి వారి జాతర మహోత్సవాలు ఏప్రిల్ 6, 2026 సోమవారం నుండి ఏప్రిల్ 11, 2026 శనివారం వరకు ఘనంగా నిర్వహించబడనున్నాయి.ఆలయ కమిటీ భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు, పాత్రికేయులు, కుల సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆహ్వానించింది.జాతరలో భాగంగా ఏప్రిల్ 7న మధ్యాహ్నం 3 గంటలకు భద్రకాళి మాతతో వీరభద్రేశ్వర స్వామి వారి కళ్యాణం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం ఊరేగింపుగా జరుగుతుంది. అదే రోజు రాత్రి 10 గంటల నుండి పెద్దిరాజుపెద్దమ్మ పౌరాణిక నాటకం ప్రదర్శించనున్నారు.ఏప్రిల్ 9న నాటకం రెండవ భాగం, ఏప్రిల్ 11న బసవేశ్వర ఆలయం నుండి రథోత్సవం తిరిగి వీరభద్రేశ్వర ఆలయానికి ఊరేగింపుగా చేరుతుంది.అనంతరం పెద్దిరాజు-పెద్దమ్మ నాటకం చివరి భాగం ప్రదర్శించబడుతుంది.ఈ మహోత్సవంలో పాల్గొని స్వామి వారి దివ్య దర్శనం చేసుకుని పునీతులు కావాలని ఆలయ చైర్మన్ ప్రభాకర్ రావు కులకర్ణి మరియు సభ్యులు కోరారు.

# బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వట్పల్లి మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ




సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలో ఈ రోజు భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి పార్టీ చరిత్ర, భవిష్యత్తు లక్ష్యాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ, భారతీయ జనసంఘ్‌గా ప్రారంభమైన పార్టీ అంచెలంచెలుగా ఎదిగి భారతీయ జనతా పార్టీగా అంతర్జాతీయ స్థాయిలో అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా పార్టీ అధికారాన్ని సాధిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్ స్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సురేష్ గౌడ్, బీజేవైఎం జిల్లా వైస్ ప్రెసిడెంట్ పట్లల్ల అరవింద్ పటేల్, అసెంబ్లీ కో-కన్వీనర్ అనిల్ కుమార్, మండల జనరల్ సెక్రటరీ యాదయ్య, మండల ఉపాధ్యక్షులు యాదగౌడ్, వెంకట్రావు, సోషల్ మీడియా కన్వీనర్ శశిధర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు సంగమేశ్వర్, అసెంబ్లీ సోషల్ మీడియా కో-కన్వీనర్ సంగమేశ్వర్, సీనియర్ నాయకులు విట్టల్ రావు, రాములు, రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేశారు.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి శాఖల సమన్వయం అవసరం – కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న “హెల్త్ వీక్” కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేసి ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో ఆరోగ్య సేవల బలోపేతం, అవగాహన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఏప్రిల్ 6 నుండి 11 వరకు జరిగే హెల్త్ వీక్ కార్యక్రమాలను అన్ని శాఖలు కలిసి సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రత దినం, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, సురక్షిత తల్లి దినం, ఎయిడ్స్ అవగాహన దినం, ఆయుష్ దినం, ఔషధ నియంత్రణ దినం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించాలని, ర్యాలీలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రతిరోజు కార్యక్రమాలపై ఫోటోలు, నివేదికలను సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, డీఎంఅండ్ హెచ్ ఓ వసంత్ రావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ కవిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులపై వేగవంతమైన పరిష్కారం కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా లో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజలు సమస్యల పరిష్కారంపై నమ్మకంతో ప్రజావాణికి వస్తున్నారని పేర్కొన్న కలెక్టర్, ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 67 అర్జీలు అందినట్లు తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 7న జిల్లా కోర్టు సముదాయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య తెలిపారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో పిల్లల వైద్యులు, గైనకాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్లు, కార్డియాలజిస్టులు, ఆర్థోపెడిక్ నిపుణులు, కంటి వైద్యులు, ఈఎన్‌టీ స్పెషలిస్టులు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

## వట్పల్లి రైతు వేదికలో వార్డ్ సభ్యులకు శిక్షణ ప్రారంభం



సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని రైతు వేదికలో నూతనంగా ఎంపికైన 11 గ్రామ పంచాయతీల వార్డ్ సభ్యులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. తొలి బ్యాచ్‌లో పాల్గొన్న వార్డ్ సభ్యులకు టి.ఓ.టి. లుగా లోకేష్, కిషోర్ శిక్షణ అందిస్తూ, వారిని పంచాయతీ వ్యవహారాల, స్థానిక శాసన పరిజ్ఞానం, గ్రామ అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, మండల కార్యాలయ సిబ్బంది, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



## గోరక్ష చట్టాల కఠిన అమలు కోసం చీఫ్ సెక్రటరీకు వినతిపత్రం – విశ్వహిందూ పరిషత్ డిమాండ్

సందేశం టైమ్స్, తెలంగాణ, ఏప్రిల్ 07, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో గోరక్షణ చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ (VHP) ప్రతినిధి బృందం సోమవారం రాష్ట్ర సచివాలయంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును కలిసారు మరియు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు గోమాత భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, రాష్ట్రంలో గోవుల అక్రమ రవాణా, అక్రమ వధ, చట్టవిరుద్ధ మాంస రవాణా ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రంలో గోరక్షణ చట్టాల అమలుపై ప్రత్యేక నిఘా, టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, చెక్‌పోస్ట్‌ల్లో కఠిన తనిఖీలు, అక్రమ వధశాలలపై చర్యలు, నిందితులపై కఠిన శిక్షలు, గోశాలలకు ప్రభుత్వ సహాయం, సంబంధిత శాఖల సమన్వయం పెంపు వంటి డిమాండ్లను పేర్కొన్నారు. దీనికి స్పందించిన చీఫ్ సెక్రటరీ గోహత్య నిషేధ చట్టాలను కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పగుడాకుల బాలస్వామి, రమేష్, సుభాష్ చందర్, దుర్గానంద, సర్వేశ్వర శివయోగి అంబిక, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ 2045 లక్ష్యాలకు వ్యవసాయం కీలకం – మంత్రి తుమ్మల నాగేశ్వరరావు






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా లో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మరియు ఇక్రిశాట్ సంయుక్త ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గ యువ రైతులకు సాయిల్ హెల్త్ వాలంటీర్లుగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని పటాన్చెరు ఇక్రిశాట్ వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రతి గ్రామం నుంచి ఒక్కో రైతును ఎంపిక చేసి భూసార పరీక్షలు, పంటల ఎంపిక, పంటల మార్పిడి, వాతావరణ ప్రభావం, అంతర్ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై నిపుణులు శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2045 లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం, అగ్రిటెక్ వినియోగాన్ని పెంపొందించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూమి ఆరోగ్యం కాపాడటం ద్వారా దిగుబడులు పెరుగుతాయని, సాయిల్ హెల్త్ వాలంటీర్లు గ్రామ స్థాయిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూసారం దెబ్బతింటుందని పేర్కొన్న మంత్రి, పంటల మార్పిడి, బయో ఫెర్టిలైజర్లు, సేంద్రీయ ఎరువుల వినియోగంతో నేల సారవంతత పెంపొందించుకోవాలని సూచించారు. వ్యవసాయ యాంత్రిక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లాభదాయక వ్యవసాయం అభివృద్ధి చేసి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మెహన్, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జానయ్య, కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్టాన్ఫోర్డ్ బ్లాడే, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఆహార నాణ్యతపై జాగ్రత్త అవసరం – కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా లో ఆహార భద్రతలో భాగంగా ప్రజలు ఆహార పదార్థాల కొనుగోలు సమయంలో నాణ్యత ప్రమాణాలు, ఎక్స్పైరీ తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఆహార పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, లైసెన్స్ మేళా, ఫుడ్ స్టాళ్లలో కల్తీ ఆహారంపై లైవ్ డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా "పండ్లను కృత్రిమంగా పక్వం చేయుటకు సరైన మార్గం" అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి, అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆహార వ్యాపారులు లైసెన్సులు తప్పనిసరిగా పొందుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించిన ఆమె, కల్తీ ఆహారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎక్కడైనా కల్తీ ఆహారం గుర్తిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఆరోగ్య వారోత్సవం (ఏప్రిల్ 6–11) సందర్భంగా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహార సంబంధిత ఫిర్యాదుల కోసం 9908978790, 9985600602 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీఓ రాజేందర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు అమృత్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## బోరంచల పోచమ్మ జాతరకు దాతృత్వం భక్తుల సహకారం

సందేశం టైమ్స్, మనూర్ మండల్, ఏప్రిల్ 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ తల్లి దేవస్థానంలో జరగనున్న 7 వారాల మహా జాతర ఏర్పాట్లలో భాగంగా భక్తులు దాతృత్వంతో ముందుకు వస్తున్నారు. ఈ సందర్భంగా గుడికి సీరియల్ లైట్స్, కలర్ లైట్స్ ఏర్పాటు కోసం మాధ్వార్ గ్రామానికి చెందిన దాత పిట్ల అంజయ్య రూ. 5,111 విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ అర్చకులు సిద్దయ్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ చైర్మన్ మల్లయ్య శాలువాతో సన్మానించారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదిస్తూ ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.